తిరుపతి - చిత్తూరు

## వివాహిత అనుమానాస్పద మృతి.. నలుగురిపై కేసు



పాకాల, జూన్ 9, (ప్రభాతవార్త): పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కుక్కలపల్లి గ్రామంలో వివాహిత మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు వివరాల మేరకు, కుక్కలపల్లికి చెందిన గొడుగుచింత ఉదయ్ కుమార్ భార్య పేరుకాలా మునిలత (30) మృతి చెందగా, ఆమె తండ్రి శంకరయ్య ఫిర్యాదు చేశారు. వివాహం జరిగినప్పటి నుంచి అదనపు వరకట్నం కోసం భర్త ఉదయ్ కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులు మానసిక, శారీరక వేధింపులకు గురిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మునిలత మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ భర్త ఉదయ్ కుమార్, పినతల్లి బుజ్జమ్మ, అక్క ఉష, చిన్నాన్న చంద్రబాబులపై వరకట్న వేధింపులు, ఆత్మహత్యకు ప్రేరేపించడం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పాకాల సీఐ టి. చిన్న గోవిందు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## సకల శుభకరం పండ్లతో గంగమ్మ పరవశం



తిరుపతి, జూన్ 9(ప్రభాతవార్త): తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంటగంగమ్మను మంగళవారం వివిధ రకాల పండ్లతో అలంకరించారు. జాతర తరువాత వరుసగా ఐదు మంగళవారాలు ప్రత్యేక జాతరగా జరుగుతుంది. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకము జరిపించారు. అలంకరణ దాతలు జితేంద్ర, రావూరి వెంకటస్వామి, కంచి లోకనాధ రెడ్డి కుటుంబం సహకారముతో గంగమ్మను ఆలయాన్ని వివిధ రకాల పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఆలయ ఈఓ ఎ. జయకుమార్, సభ్యులుభక్తులకు దర్శనం చేయించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# మట్కా కింగ్‌పిన్ పద్మనాభం అరెస్ట్

### ఆతని వాంగ్మూలంతో ఇద్దరు సిఐలు,నలుగురుకానిస్టేబుల్స్ సస్పెండ్.. డివైయస్‌పికి చార్జ్ మెమో



మట్కాకింగ్ పద్మనాభం

శ్రీకాళహస్తి,జూన్ 9 ప్రభాతవార్త తిరుపతిజిల్లాలో మట్కా,జూదంపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కఠినంగా వ్యవహరించుటకు నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి అందిన సమాచారం మేరకు శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు సిఐలు,నలుగురుకానిస్టేబుల్స్‌ను సస్పెండ్ చేసినట్లు డివైయస్‌పికి చార్జ్ మెమో జారి చేసినట్లు సమాచారం అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. పది సంవత్సరాలుగా వ్యవస్థలను మేనేజ్‌చేసుకుంటూ



పైన డివైయస్‌పి, కింద మైక్ పట్టుకున్న సిఐ గోపి, పక్కన సిఐ ప్రకాష్‌కుమార్

తప్పించుకు తిరుగుతున్న మాట్కా జూదం కింగ్ పద్మనాభంను తిరుపతి పోలీసులు అరెస్టు చేసారు. పదేళ్ళుగా శ్రీకాళహస్తి,తిరుపతి పుణ్యక్షేత్రాలతో పాటు నగరి,తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో విచ్చల విడిగా మట్కా ఆడిస్తూ ప్రజల జీవితాలనునాశనం చేసిన పద్మనాభంను పోలీసులు చాకచక్యంగా అదుపులో తీసుకున్నారు. విచారణలో ఎన్నో కీలక అంశాలను పద్మనాభం పోలీసులకు వివరించారు. అయితే ఈ ఆటలు సాగించటానికి ఆయన పోలీసుల్ని ఎలా మేనేజ్ చేసింది. జిల్లా ఎస్‌కికి వివరించారు.దాంతో జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు పుణ్యక్షేత్రాల్లో మట్కాతో ప్రజల జీవితాలను నాశనం చేయటంలో భాగస్వాములైన ఇద్దరు సిఐలను సస్పెండ్ చేసారు. పద్మనాభం వాంగ్మూలంతో జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు విచారణకు ఆదేశించారు. విచారణజరిపిన అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా మట్కా కింగ్‌కు సహకరించిన పోలీసులు కూడా ఆక్రమాలకు పాల్పడినట్లు తేలటంతో ఆతనికి సహకరించిన పోలీసులపై చర్యలు తీసుకున్నారు.సస్పెండ్ చేసిన వారిలో గతంలో ఒక్కడి టౌన్‌లో పని చేసి ప్రసుతం పుతలపట్టు సిఐగా పని చేస్తున్న డి.గోపి, ప్రస్తుతం శ్రీకాళహస్తి వన్‌టౌన్‌లో పని చేస్తున్న సిఐ ప్రకాష్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారి చేసారు.కాగా ఈ తతంగంలో పూర్తిగా సహకరించిన కానిస్టేబుల్స్ డి.ఎస్‌పి కార్యాలయంలో పని చేస్తున్న ప్రవీణ్‌తో పాటు హేమాద్రి, ప్రతాప్,క్రాంతి కుమార్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్‌పి ఆదేశాలు జారి చేసారు. కాగా శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహమూర్తికి చార్జ్ మెమో జారి చేసినట్లు కూడా పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఓ ప్రకటనలో ఎస్‌పి సుబ్బరాయుడు జూదం,మట్కా వంటి అసాంఘీక కార్యక్రమాలకు ఎవరు సహకరించినా ఉపేక్షించేది లేదని శాఖలో అవినీతిపరులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీకాళహస్తిలో జూదం,మట్కాలను పూర్తిగా రూపుమాపాలని స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఎంతో కాలంగా పోలీసులకు సూచిస్తున్నారు.అలాగే గంజాయి బ్యాచ్‌పై దయాదాక్షిణ్యాలు వద్దని పలుమార్లు ఆదేశిస్తున్నారు.

### రెండు సంవత్సరాల సుపరిపాలన

# ప్రజలతో మమేకం..

### జూన్ 12న తిరుపతిలో ఎన్‌డిఏ కూటమి విజయోత్సవాల సభ నిర్వహణ..

### జిల్లా ఇంచార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్..



తిరుపతి కలెక్టరేట్, జూన్ 9 ప్రభాత వార్త:.. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 12న తిరుపతిలో బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రజలతో మమేకమై గత 24 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సుపరిపాలన, చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని ఎన్డిఏ ప్రభుత్వం యోచన చేయడం జరిగిందని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఎన్డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా తిరుపతిలో దామినేడు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు జూన్ 12న విచ్చేస్తున్న నేపథ్యంలో మంగళవారం సభా ప్రాంగణం వద్ద ముందస్తు ఏర్పాట్లను జిల్లా ఇంచార్జ్ మంత్రి, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడుతో కలిసి క్షేత్ర స్థాయిలో సమీక్షి ంచారు. ఈ కార్యక్రమంలో జేసి ఆర్.గోవిందరావు, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, చంద్రగిరి,సూళ్లూరుపేట, గూడూరు ఎంఎల్ఏ లు పులివర్తి నాని, నెలవల విజయశ్రీ, పాశం సునీల్, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్స్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఎన్డిఏ కూటమి ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎన్డిఏ కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కార్యక్రమాలను వివరించేందుకు తిరుపతి, అమరావతి, విశాఖపట్నం ప్రాంతాల్లో విడివిడిగా సమావేశాలు నిర్వహించాలని గతంలో నిశ్చయించుకోవడం జరిగిందని తెలిపారు. అయితే, దురదృష్టవశాత్తు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కారణంగా బాధితులకు అండగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించడంతో రాష్ట్ర మానవ వనరులు, ఐటిశాఖ మంత్రితో పాటు పలువురు మంత్రులు బాధితులను పరామర్శించడం జరిగిందన్నారు. దుర్ఘటన పై స్పందించిన ముఖ్యమంత్రి బాధిత కుటుంబాలకు రూ.10 కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించారన్నారు. కేంద్రం నుంచి కూడా సహాయం అందించడం జరుగుతుందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు బాధిత కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎన్డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా కేబినెట్ మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన జూన్ 12 తేదీన మూడు ప్రాంతాలలో కాకుండా రాష్ట్ర స్థాయిలో తిరుపతి పట్టణంలో బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిశ్చయించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధ్వంసం నుండి వికాసం వైపు ప్రయాణిస్తోందన్నారు. ఎన్డిఏ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన తీరును వివరించడం కోసమే బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ హామీ నెరవేర్చడంతో పాటు ఈ 24 నెలలను సూపర్ 24 చేశామన్నారు. ప్రజల పై గౌరవం ఉన్న ముఖ్యమంత్రి నెలకు కనీసం 10 సార్లు ప్రజలతో మమేకమై క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించే దిశగా పరిపాలన సాగిందన్నారు. మన దేశానికి వచ్చే పెట్టుబడులలో 25 శాతం పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందని, దీనితో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్లు పెట్టుబడులు రావడం జరిగిందన్నారు. ఉద్యోగ కల్పనలో భాగంగా ఎప్పుడూ వినని విధంగా డిఎస్సి నిర్వహించామని, రైతులకు పిఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ, తల్లులకు తల్లికి వందనం కింద నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామన్నారు.

# ముగ్గురాయి సరఫరా.. గ్రేడుల్లో గందరగోళం

### ... జియాలజీ సెక్షన్ లో మాయాజాలం..

### నిద్రావస్థలో ఏపీఎండిసి అధికారులు....

ఓబులవారిపల్లి, జూన్ 9ప్రభాతవార్త:



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట ఏపీఎండిసి లో గత రెండు దశాబ్దాలుగా. సంస్థలు విధులు నిర్వహిస్తున్న ఆయా సెక్షన్ల కు సంబంధించిన అధికార యంత్రాంగం పలు కంపెనీలతో లో పాయి కార ఒప్పందాలు కుదుర్చుకుని కమీషన్లకు క కృత్తిపడి అన్నం పెట్టే ఏపీఎండిసి సంస్థకే సున్నం పెడుతూ కోట్లాది రూపాయలు నష్టాన్ని కలిగిస్తున్న అవి ఎవరికి పట్టినట్లు తెలిసి తెలియనట్లు. పెద్ద స్థాయి అధికారులు కూడా పట్టించుకోకుండా ఉండే వారిని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం గత పది సంవత్సరాలుగా గ్రేడుల్లో గందరగోళం జరుగుతూ. ఏ గ్రేడ్ బి గ్రేడ్ కనిజాలు ఉన్నప్పటికీ సీఎండి బదులు. బి గ్రేడ్ మరియు ఏ గ్రేడ్ ఖనిజాలను జియాలజీ సెక్షన్ మాయాజాలంతో గ్రావిటీ ఉన్నట్లు సిఎన్డినే అని ప్రజలకు చూపుతూ పెద్ద మొత్తంలో ఏ గ్రేడ్ బి గ్రేడ్ కనిజాలను అప్పనంగా టిప్పర్ల ద్వారా సరఫరా చేస్తూ. సమస్తను నష్టాలు బాటలు నడిపించేందుకు వారు స్వలాభాల కోసం. సమస్త కు కరా కొట్టి వాళ్ల జోబులు నింపుకుంటున్నారని విమర్శలు గుప్పిస్తున్నాయి. దాదాపు ప్రస్తుతం బల్క్ గా 60 లక్షల టన్నులు పాత డబ్బులు సీఎండి ఖనిజం ఉన్నప్పటికీ ఆ ఖనిజాన్ని పక్కనపెట్టి కొత్తగా ప్రస్తుతం ముగ్గురాయి.తీసుకొచ్చే ఖనిజాన్ని చేయండి గ్రావిటీ ఉన్న బి గ్రేడ్ కనిజాన్ని కొంతమంది అధికారులకు తెలియకుండానే సిఎన్డినేనంటూ అక్కడ పనిచేసే కొంతమంది వర్కర్లు అధికారులు మిల్లర్లకు అటు పెద్ద పెద్ద కంపెనీలకు సరఫరా చేస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. దొరికినోడు దొంగ దొరకనివాడు దొర అన్నట్లు కొన్నిసార్లు విషయం తెలుసుకున్న అధికారులపై అక్కడ పనిచేసే ఓ అధికారి చక్రం కూడా మార్చి ఆయన్ని మందలించినట్లు సమాచారం. ఏది ఏమైనా కోట్లాది రూపాయలు ఏపీఎండిసి సంస్థకు గండికోడుతూ కొంతమంది. ఎక్స్పోర్ట్ కంపెనీలకు వత్తాసు పలుకుతూ వారి వద్ద నుంచి కమీషన్ల దందా సాగిస్తూ ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు ఏది ఏమైనా పాతగా ఉన్న బలుకు డంపును సిఎండి ఉన్న ఆ డబ్బు నుంచి ఖనిజాన్ని తరలించకుండా నూతనంగా గనుల నుంచి తెచ్చే సీఎండి ఖనిజాన్ని సరఫరా చేస్తూ ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని ఏపీఎండిసిలో ఎటువంటి అవినీతికి తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు బిజెపి నాయకులు ఆర్థిక విశ్లేషకులు కార్మిక నాయకులు కోరుతున్నారు

# విశ్వాసానికి, అభివృద్ధికి జనకల్యాణానికి పుష్కరకాలం

### -కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి



తిరుపతి,జూన్ 9ప్రభాతవార్త: విశ్వాసానికి, అభివృద్ధికి, జనకల్యాణానికి 12 సంవత్సరాలు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ విజయాలను కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార,పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషివివరించారు. సౌరశక్తి పవనశక్తి రంగాల్లో ప్రపంచంలో వరుసగా మూడు, నాలుగో స్థానాల్లో భారత్‌నిలిచిందని తెలిపారు. గత 11 సంవత్సరాల్లో 60 వేల కిలోమీటర్లకు పైగా కొత్త రహదారులు, హైస్పీడ్ కారిడార్లు నిర్మించామని వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం తిరుపతిలో మీడియాప్రతినిధులతో కేంద్రమంత్రి జోషి మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో భారత్ చీకటి నుంచి విద్యుత్ మిగులు దేశంగా మారిందని తెలిపారు. దేశ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 538 గిగావాట్లకు చేరుకోగా, అందులో 33 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే వస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ ్మ, భాను ప్రకాష్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మామిడి కొనుగోళ్ళపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అకస్మిక తనిఖీ

చిత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త : మామిడి కొనుగోళ్ళపై కలెక్టర్ సుమిత్‌కుమార్ జిడినెల్లూరు మండలంలోని జైన్ మామిడి గుజ్జు పరిశ్రమను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీకి మామిడి సరఫరా చేయడానికి మామిడికాయలను తీసుకువచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ మామిడికి ఫ్యాక్టరీలు ఎంత ధర చెల్లిస్తున్నాయి! పాదర్శకంగా రైతుల నుండి మామిడి కొనుగోలు చేయాలని ఫ్యాక్టరీ యాజమానులను కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. అనంతరం మామిడి కొనుగోలు ప్రక్రియపై జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ యాజమానులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో వున్న రైతుల వద్దకు కలెక్టర్ వెళ్ళి నేరుగా మాట్లాడి మామిడి కాయల ధరలు, టోకెన్ల జారీ విధానం, మామిడి కొనుగోళ్ళ ప్రక్రియపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ యాజమాన్యంతో మామిడి ధరలపై కలెక్టర్ సుమిత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిడినెల్లూరు తహసిల్దారుతో పాటు జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ యాజమాన్యం, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఫోటో: 03సిటిఆర్09: జిడినెల్లూరు మండలం జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ ఆవరనలో మామిడి



# కుప్పంపై సిఎం చంద్రబాబు ఇక స్పెషల్ ఫోకస్

### పార్టీ నేతల్ని గాడిలో పెట్టేలా... ప్రజలు.. కార్యకర్తలకు మరింత అండగా నిలిచేలా !!

### - స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణుల్ని సన్నద్ధం చేసేందుకు చర్యలు !!

### -అందుకే ఎమ్మెల్సీ కంచర్లకు రాష్ట్రస్థాయిలో ఛాన్స్?

కుప్పం, జూన్ 9 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంపై స్పెషల్ ఫోకస్ సారించారు. కుప్పంలో ఇకపై పార్టీ వ్యవహారాలు, అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ తానే స్వయంగా పర్యవేక్షిస్తానని సిఎం చంద్రబాబునాయుడు తాజాగా పార్టీ శ్రేణులకు ఉండవల్లిలోని తమ స వ్యగృహంలో జరిగిన సమావేశంలో కుప్పం నేతలకు స్పష్టం చేసిన విషయం విదితమే. దీంతో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు మరింత అండగా నిలవాలనే ఆలోచనతో సిఎం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. 1989నుంచి వరుసగా ఏడుసార్లు తనను గెలిపిస్తున్న కుప్పం ప్రజలకోసం 2024కంటే ముందు ఆ తర్వాత అనే రీతిలో కుప్పంలో అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన రెండేళ్లలోనే కుప్పానికి 7223కోట్లతో భారీ పరిశ్రమలు తీసుకువచ్చారు. మరిన్ని పరిశ్రమలు సైతం తెచి ్చ ఇక్కడ యువతకు ఉపాధి కల్పించాలని నిర్ణయించారు.

పార్టీ నేతల్ని గాడిలో పెట్టేలా : ఉండవల్లిలో జరిగిన సమావేశంలో సిఎం చంద్రబాబునాయుడు కుప్పం నేతలకు హితోపదేశం చేశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో బలంగా తీసుకెళ్లాల్సి న అవసరం ఉందని పార్టీ శ్రేణులకు సూచించారు. తద్వారా ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువ కావాల్సి ఉందని ప్రజల్లో సైతం ప్రభుత్వంపై సానుకూలత మరింత పెరగాల్సి ఉందని సిఎం చంద్రబాబు పార్టీ నేతలతో పేర్కొన్నారు. కుప్పంలో నేతలు తమ సొంత వ్యాపకాలు తగ్గించుకుని పార్టీ కోసం పనిచేయాలని లేకుంటే అలాంటి వారిపై చర్యలు తప్పవని సిఎం చంద్రబాబు నర్మగర్భంగా హెచ్చరించారు.మూడేళ్ల పాటు తన నియోజకవర్గంలో తాను అప్పగించిన బాధ్యతలను నిర్వహించిన ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్ కుప్పంలో బాగా పనిచేశారని ఆయన సేవల్ని రాష్ట ్రస్థాయిలో తీసుకుంటామని సిఎం చంద్రబాబు నాయుడు కుప్పం నేతలతో పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఈ నిర్ణయం తీసుకునేముందు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో సహృద్భావ వాతావరణంలో చర్చించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. కుప్పంలో పార్టీ వ్యవహారాలు, అభివృద్ధి పనులపై చర్చించారని సమాచారం. పార్టీ పరిణామాల దృష్ట్యా కుప్పం వ్యవహారాలు తాను చూసుకుంటానని రాష్ట్రస్థాయిలోపార్టీ అవసరాల దృష్ట్యా కొత్త బాధ్యతలు ఇస్తానని ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు సిఎం సూచించారని తెలిసింది. తాను ఏది చేసినా ప్రజలకోసమే చేస్తానని పార్టీ యంత్రాంగం ప్రజలకు దగ్గరగా ఉండాలని ఆదేశించారు. మున్ముందు కుప్పంలో పార్టీ పరంగా తన లైన్ ఎలా ఉంటుందో సిఎం స్పష్టం చేసేశారు. కుప్పంలో కొత్తగా పిఎగా నియమితులైన శ్రీకాంత్‌కు కూడా సహకరించి నేతలు సమన్వయంతో పనిచేయాలని సిఎం ఆదేశించారు. మున్ముందు సిఎం చంద్రబాబునాయుడు పార్టీ నేతలను లైన్‌లో పెట్టుకుని పార్టీ బలోపేతం, అభివృద్ధిపై తగు నిర్ణయాలు తీసుకుంటారనడంలో స ందేహం లేదు.

# అన్నింటికి తిలోదకాలిచ్చి: వందేళ్ల పండగనా?

### వ్యాసాశ్రమంలో భక్తుల ప్రవేశానికి అంక్షలెందుకు?ధార్మిక కార్యక్రమాలకు చెల్లుచీటి

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తికి సుమారు 15 కిలో మీటర్ల దూరంలో మలయాళ స్వామిచే ఏర్పాటు చేసిన వ్యాసాశ్రమం ఉంది. ప్రస్తుతం ఈ ఆశ్రమా నికి పీఠాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సాధువు పరిపాలనలో ఆశ్రమం అధోగతికి దిగజారిందనే విమర్శలు ఆరోపణలు రాజ్యమేల ుతున్నాయి. 75 సంవత్సరాల పాటు భక్తుల ప్రసంశలందుకున్న ఆశ్రమం నేడు ఇలా విమర్శలు ఎదుర్కొనటానికి కారణం ఇక్కడ పీఠాధిపతి బందువుకు పరిపాలనా బాధ్యతలు అప్పగించటమే. మలయాళ స్వామి నుంచి తరువాత వచ్చిన విద్యానందస్వామి వరకు ప్రస్తుత పీఠాధిపతి సహాయకులుగా ఉంటున్నారు.ముందు పీఠాధిపతులు వచ్చిన ధనంతోనే అనేక కార్యక్రమాలు నిర్వహించే వారు.సేవా కార్యక్రమాలు నిర్వర్తించేవారు. స్థలాలు కొన్నారు కానీ అమ్మలేదు. ఆశ్రమం ఎంతో అభివృద్ధి చెందింది భక్తుల్లో ఎంతో గౌరవ భావం ఉండేది.దార్మిక కార్యక్రమాలకు నిలయంగా ఉండేది.

**ఎవరికి అనుమతిలేదు: ఏ సేవా కార్యక్రమం లేదు:**

గతంలో ఆశ్రమంలో బ్రహ్మచారులు,బ్రహ్మచారిణులు,సాధువులు, వానప్రస్తులు ఉండేవారు. వారి సారధ్యంలో ఆశ్రమంలో భక్తి బావం ఉండేది. నేడు ఆశ్రమంలో ఎవ్వరూ లేరు. బ్రహ్మవిద్య పాఠశాల ఏమైందో పీఠాధిపతికే తెలియాలి. బాలుర పాఠశాల పూర్తిగా నశించి పోయినవి. కన్యాగురుకులం అమ్మాయిలు నివసించే వారు ఆ పాఠశాలలో పురుషులకు ప్రవేశం లేదు. మరి ప్రస్తుత పీఠాధిపతి బాధ్యతలు స్వీకరించిన తన బంధువును నిర్వాహణ బాధ్యతను అప్పగించారు. ఆయన సరాసరి కన్యాగురుకులంలోనే తన కార్యాలయం ఏర్పాటు చేసుకోవటంతో ఎన్నో ఆరోపణలు ప్రభుత్వ ద్వారా విచారణ జరపటం గమనించదగ్గ విషయం.ఆయన సారధ్యంలోనే ఆశ్రమం నిర్వహించబడుతూ నియమ నిబంధనలను తుంగలో తొక్కి వివాదాలకు మూలకారకుడుగా మారారు.ఆశ్రమంలో చక్కటి పూజా మందిరం నిర్మించారు. ఇక్కడ పూజారులే లేరు. పూజలు మొక్కుబడిగా మారాయనే విమర్శలు చోటు చేసుకున్నాయి. ఇక నాడుపరిపాలించిన పీఠాధిపతులు చుట్టుపక్కల ప్రజల సౌకర్యార్థం ఆసుపత్రి, కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేసారు. ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి.వృధాశ్రమం మూతబడింది. మ్యూజియం, గ్రంధాలయం మూత పడ్డాయి. స్థూపం వద్ద పూజలకు స్వస్తి పలికారు.ఇక ఆశ్రమం ద్వారా



శ్రీ మలయాళ స్వామివారి పూజా మందిరము

నిర్వహించే ముద్రణాలయం చెల్లు చీటి పాడారు.

**భక్తులకు ప్రవేశం నిషేధం:**

వ్యాసాశ్రమం ఒక నాడు భక్తులతో పర్యాటకులతో కళ కళ లాడేది. నేడు ఇక్కడ భక్తులకు ప్రవేశం నిషేధం, దూర ప్రాంతాల నుంచి వేలాది మ ంది వచ్చే వారు. కానీ నేడు ఇక్కడ భక్తులకు ప్రవేశం నిషేధించారు. భక్తుల సంఖ్య సన్నగిల్లింది. ఇక్కడ ప్రవేశించాలంటే ముందస్తు అనుమతి కావాలి.పూర్వ ఆశ్రమంలో 24గంటలు తెరచి ఉండేది నేడు ఆంక్షలతో గేట్లుమూత బడింది. అత్యవసరంగా భక్తులకు అనుమతి ఇస్తున్నారు. ఇక భోజన శాల ఒక నాడు కళ కళ లాడేది.ఇక్కడ భోజనం అంటే ఎంతో ఇష్టంగా భక్తులు తినే వారు. సాధువులకు అనేక సార్లు బిక్షలు జరిగేవి, మంచి భోజనాలు అందించే వారు. నేడు అన్నింటికి స్వస్తి పలికారు. ఆశ్రమంలో సాదువులే లేరు.

(రేపటి సంచికలో మరి కొన్ని విశేషాలు)

## ఎన్డీఏ సభా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే విజయ శ్రీ

సూళ్లూరుపేట, జూన్ 9, ప్రభాతవార్త



తిరుపతిలో ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న విజయోత్సవ సభ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సహచర ప్రజాప్రతినిధితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగాఈ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌తో పాటుపలువురు కూటమి నేతలు హాజరుకానున్నారు. ఈనెల తొమ్మిదో తేదీన జరగవలసిన విజయోత్సవ వైజాగ్ స్టీల్స్‌లో జరిగిన దుర్ఘటనతో వాయిదా పడింది. తిరిగి ఈ సేవను ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నారు. దీంతో తిరుపతి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పాశం సునీల్ కుమార్, పులివర్తి నాని, పనబాక లక్ష్మి, నరసింహ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఖరీఫ్‌కు సన్నద్ధం

### - వ్యవసాయ శాఖ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త:

ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ వ్యవసాయశాఖ అధికారులతో వ్యవసాయశాఖ సేవలు, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయదగిన పంటలు, ఆధునిక వ్యవసాయ సాగు విధానాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరచి నాణ్యమైన సేవలు అదించాలన్నారు. రైతు యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు యాప్ డౌన్‌లోడ్లు, లాగిన్‌ల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల పంపిణీ ప్రక్రియపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో వున్న లోపాలు, పెండింగ్ కేసులను పరిశీలించి వెంటనే సరిదిద్దాలన్నారు. అన్నదాత సుఖీభవ పెండింగ్ దరఖాస్తులను కారణాలను విశ్లేషించి ఆర్ఎస్‌కె వారీగా సమగ్ర నివేదిక అందించాలన్నారు. ఈ-క్రాప్, ఇతర రైతు డేటా నమోదుల్లో ఎలాంటి పొరబాట్లు లేకుండా కచ్చితమైన సమాచారంను నమోదు చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు అందించాలన్నారు. ఎరువులు, విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలివెళ్ళకుండా పక్కా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి మురళీ, ఎడిలు, ఎంఎఓలు పాల్గొన్నారు.



## పంట నమోదుకు ఏఐ అనుసంధానం

### - మండల వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్

చిట్టమూరు, జూన్ 9 ప్రభాతవార్త



ఏపీ ప్రభుత్వం పంట నమోదుకు వినూత్నంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను అనుసంధానం చేసినట్లు మండల వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా యూరియా, కాంప్లెక్స్ ఎరువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏపీఐఎంఎస్ యాప్‌ను సోమవారం నుంచి అందుబాటులోకి తెచ్చిందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డి వాగు ఆర్ఎస్కె పరిధిలో మండలంలోని అన్ని ఆర్ఎస్కెల ఇన్చార్జీలతో సమావేశం ఏర్పాటు చేసి యూరియా పంపిణీ తదితర అంశాలపై వివరించారు. గతంలో యూరియా పంపిణీ కార్డుల ద్వారా ఒక్కో ఎకరానికి మూడు బస్తాలు పంపిణీ చేసేవారమని కానీ ప్రభుత్వం నిర్దేశించిన యాప్ ద్వారా మాత్రమే నత్రజని ఎరువులు పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచనలు చేశారు. విడుదల చేసిన ఏపీఐఎంఎస్ యాప్ పనితీరును ఆయన స్వయంగా వివరించారు. ముఖ్యంగా వ్యవసాయ సిబ్బంది తమ పరిధిలో ఖరీఫ్లో జరిగే ఈక్రాప్ నమోదులో కచ్చితంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి యూరియా కార్డులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి సర్వే నంబర్‌లో పంట వేశారో లేదో నిర్ధారించుకున్నాకే కార్డులు పంపిణీ చేయాలని ఆయన స్పష్టంగా తెలియజేశారు. అన్ని ఆర్ఎస్కెల ఇన్చార్జిలందరూ ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడే పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. రైతులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎరువుల కొరత లేకుండా వారికి అందజేసే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని నిరంజన్ కుమార్ ఈ సందర్భంగా తమ సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు.

## కూరగాయల మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచండి

### కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదాదేవి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 9 ప్రభాతవార్త:



కూరగాయల మార్కెట్లను మరింత పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి అధికారులకు, నిర్వాహకులకు సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో భాగంగా మంగళవారం నగరంలోని జయనగర్, పరసాల వీధి, చింతకాయల వీధి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాగా జయ నగర్ కాలనీలో కాలువలు పాడైపోయాయని ప్రజలు కమిషనర్ ను కోరగా వాటిని వెంటనే బాగు చేయాలని అధికారులకు చెప్పారు. నగరంలోని అన్ని ప్రధాన కాలువల్లో షిల్టు తీపించి శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. నగరంలో ఎక్కడా కూడా చెత్తకుప్పలు లేకుండా పారిశుద్ధ్య సిబ్బంది తొలగించాలని సూచించారు. రామచంద్ర పుష్కరిణి చుట్టూ ఎక్కడ చెత్త వేయకుండా చూడాలని తెలిపారు. పరసాల వీధిలోని మార్కెట్లో సమస్యలను వ్యాపారులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి వేళల్లో అనుమానితులు గోడదూకి మార్కెట్లోకి వస్తున్నారని, ప్రహరీ గోడ ఎత్తు పెంచాలని కోరారు. మార్కెట్ లోకి ప్రజలు ఎక్కువగా వస్తుంటారని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. తన దృష్టికి తీసుకు వచ్చిన స్థానికుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డిఈ లు మధు, లలిత, శానిటేషన్ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

## నేడు ఎస్వీయూలో చారిత్రాత్మక ఘట్టం

### పండుగ వాతావరణంలో 6 స్నాతకోత్సవాలు

### ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం

### ఛాన్సలర్ హోదాలో హాజరుకానున్న గవర్నర్





తిరుపతి విద్య, జూన్ 9 ప్రభాత వార్త

రాయలసీమకె తల మాణికమైన సరస్వతీ నిలయం ఎస్వీయూ యూనివర్సిటీలో బుధవారం చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది ఇందులో భాగంగా వర్సిటీ అధికారులు శ్రీనివాస ఆడిటోరియం వేదికగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు ఆరు స్నాతకోత్సవాలు ఒకేరోజు పండుగ వాతావరణంలో జరిపేందుకు బోధన బోధనేతర సిబ్బంది సహకారంతో నాతో కూర్చొని స్నాతకోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు. వర్సిటీలోని అన్ని విభాగాల అధికారులు స్నాతకోత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు 502 బంగారు పతకాలతో పాటు యూజీ, పిజి ,పీహెచ్డీ పూర్తి చేసిన విద్యార్థులకు సుమారు 15 వేల మంది విద్యార్థులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పట్టాలు అందుకోనున్నారు . ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియం వేధికగా బుధవారం జరగనున్న స్నాతకోత్సవంలో పలు రంగాలలో విశిష్ట సేవలందించిన ముగ్గురు ప్రముఖులు గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ను అందుకోనున్నారు.

### డాక్టరేట్లు అందుకోనున్న ప్రముఖుల వివరాలు

ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ కు వర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనుంది. ఆయన పంజాబ్ వర్సిటీలో ఎమ్మెసీ, బెంగుళూరు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పీ హెచ్ డి పూర్తి చేసి అక్కడే ఫిజిక్స్ ప్రొఫెసర్ గ పనిచేశారు. సెన్స్ రంగానికి ఆయన చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన ప్రధానంగా ప్రయోగాత్మక ఘనస్థితి భౌతికశాస్త్రం, కాంతి పరిక్షేపం, నానో పరిమాణంలో ఉండే పదార్థాల గుణాలపై పరిశోధనలు చేశారు. ప్రస్తుతం ఆయన టెక్నాలజీ, ఇన్నోవేషన్ విధానాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

భారత జాతీయ విజ్ఞాన అకాడమీ అధ్యక్షులు, శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన మండలి మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శేఖర్ చింతామణి మండేకు వర్సిటీ గౌరవ డాక్టరేట్ తో సత్కరించనుంది. ఆయన ఆయన పూణే విశ్వవిద్యాలయం నుండి ఫిజిక్స్ లో మాస్టర్స్ డిగ్రీ, బెంగుళూరు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుం మాలిక్యులర్ బయోఫిజిక్స్లో పీహెచ్ పూర్తి చేశారు. స్ట్రక్చరల్ బయాలజీ, ఎక్స్ రే క్రిస్టల్లాగ్రఫీ, మైకోబాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్ (క్షయవ్యాధి) ప్రోటీన్ నిర్మాణంపై విస్తృత పరిశోధనలు చేశారు. ఆయన జీవ శాస్త్ర రంగంలో చేసిన విశేషకృషికి గాను 2005 లో భారతదేశపు అత్యున్నత విజ్ఞాన పురస్కారమైన శాంతి స్వరూప్ భట్నాగర్ బహుమతిని అందుకున్నారు.

భారత బయోటెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ కృష్ణ ఎం ఎల్లకు ఎస్వీయూ గౌరవ డాక్టరేట్ను ప్రధానం చేయనుంది. ఆయన తమిళనాడు తిరుత్తణి సమీపంలో ఒక తెలుగు కుటుంబంలో జన్మించారు. హవాయి విశ్వవిద్యాలయం నుంచి ఎమ్ఎస్ డిగ్రీ, విస్కాన్సిన్‌మాడిసన్ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పూర్తి అందుకున్నారు. వ్యవసాయం, జంతుశాస్త్రంలో నిపుణులైన ఆయన 1996లో తన భార్య సుచిత్రా ఎల్లాతో కలిసి హైదరాబాద్లో భారత్ బయోటెక్ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా పోలియో, టైఫాయిడ్, రొటావైరస్ వంటి అనేక వ్యాక్సిన్లను సరసమైన ధరలకు అందించారు. కోవిడ్19 వ్యాక్సిన్ ను అభివృద్ధి చేసిన భారత్ బయోటెక్ కంపెనికీ ఆయన ఛైర్మన్ వ్యవహరిస్తున్నారు. వీరు చేసిన వైద్య శాస్త్ర సేవలకు గుర్తింపుగా 2022లో భారత ప్రభుత్వం దేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ భూషణ్ తో సత్కరించింది.

## వంటగ్యాస్ ఆయిల్ ధరలు వెంటనే తగ్గించాలి

### - రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య





వెంకటగిరి, జూన్ 9, ప్రభాతవార్త

వంట గ్యాస్, ఆయిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచి పేద ప్రజలపై పెనుబారం మోపిందని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య తెలిపారు. గ్యాస్, ఆయిల్ ధరల పెంపుకు నిరసనగా వెంకటగిరి పట్టణం కాసిపేట కూలర్ లో సిపిఐ, సిపిఎం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. గ్యాస్ ధరలు పెరగడం వల్ల పేదలు కొనుగోలు చేయలేకపోతున్నట్లు తెలిపారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం వల్ల రైతులు, సామాన్యులు ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా అన్నిటిపై ధరల చేస్తున్నట్లు చెప్పారు. సిపిఐ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి చంగయ్య మాట్లాడుతూ ఇంధనం పొదుపు చర్య అనేది ఒక బూటకం అని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల నేడు అన్ని వస్తువుల ధరలు భారీగా పెరిగాయని విమర్శించారు. సామాన్య ప్రజలు బతకలేని స్థితిలో ఉన్నట్లు చెప్పారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగు గుణపాఠం చెప్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నరసింహులు, నాయకులు శివకుమార్, కృష్ణారెడ్డి, జయ కృష్ణ,సాయి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన



చిత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త:

రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు శాఖ కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేస్తోందని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. హెల్మెట్ పెట్టు-బహుమతులు పట్టు కార్యక్రమంలో విజేతలైన ద్విచక్రవాహనదారులకు ఎస్పీ తుషార్ డూడి మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పోలీసులు 'సురక్షిత చిత్తూరు-మీ భద్రత మా బాధ్యత' అనే లక్ష్యంతో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. శిక్షల కంటే ప్రోత్సాహం ద్వారా ప్రజల్లో మంచి మార్పు తీసుకురావచ్చునని భావించి 'హెల్మెట్ పెట్టు-బహుమతి పట్టు' వంటి వినూత్న కార్యక్రమంకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తాను మాత్రమే కాకుండా వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, నాన్ కేడర్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతలు చిత్తూరు గాంధీ సర్కిల్ నుండి విజయం ఇంజనీరింగ్ కళాశాల వరకు జరిగిన బైక్ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విజయం ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో హెల్మెట్ పెట్టు-బహుమతులు పట్టు కార్యక్రమ విజేతలకు ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు నగర పరిధిలోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులకు ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు హెల్మెట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ దేవదాస్, చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణ, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ మురళీమోహన్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, జిడినెల్లూరు ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, ట్రాఫిక్ పోలీసులు, విజయం కళాశాల సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగన్మోహన్‌రెడ్డిని కలిసిన వైసీపీ విద్యార్థి విభాగానికి చెందిన చందు



శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వైసీపీ విద్యార్థి విభాగానికి చెందిన చందు మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంలో జగన్మోహన్ రెడ్డి చందుని ఆప్యాయతగా పలకరించారు. రానున్న రోజుల్లో పార్టీకి కష్టపడి పని చేస్తానని తెలియజేశారు. ఈ అవకాశాన్ని కల్పించిన మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డికి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## సర్పదోష నివారణ పూజగదిలో నాగుపాము ప్రత్యక్షం



రామకుప్పం, జూన్ 9 ప్రభాతవార్త

స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో సర్పదోష నివారణ పూజలను భక్తులు నిర్వహించుకుంటారు. మంగళవారం నాడు ఆలయంలో ఓ పక్క అర్చకులు నాగదోష నివారణ పూజలు భక్తుల సమక్షంలో నిర్వహిస్తుండగా ఆ గదిలో ఓ నాగుపాము ప్రత్యక్షమై పడగ విప్పింది. దీంతో భక్తులు కొంత ఆందోళనకు గురయ్యారు. గంటకుపైగా నాగుపాము ఆ గదిలోనే ఉండి అనంతరం వెళ్లిపోయింది.

## ఫకీరు వేషంలో మోసాలు

### పోలీసుల అదుపులో నిందితుడు

పలమనేరు, జూన్ 9, ప్రభాతవార్త:

కోటి విద్యలు కూటి కొరకే అని పెద్దలు ఊరికే అనలేదు. కడుపు నింపుకోవడానికి జీవనం సాగించడానికి ఎన్నో రకాలుగా తిరుగుతున్నారు. హిందువుగా వున్న కరణ్ అనే వ్యక్తి ఫకీరు వేషంలో మోసాలకు పాల్పడుతూ మంగళవారం పోలీసులకు పట్టుబడ్డాడు. కర్నాటక రాష్ట్రం బళ్ళారికి చెందిన కరణ్ అనే వ్యక్తి ముస్లిం దుస్తులు ధరించి ఫకీరు వేషదారణతో డప్పువాయిస్తూ పలమనేరుకు వచ్చాడు. దండపల్లె రోడ్డులో షాదీ మహల్ వద్ద నివాసమున్న ముస్లిం కుటుంబాల వద్దకు వెళ్ళి ఇంటికి దోషముంది శాంతి చేయాలని లేదంటే ఎవరైనా మృతిచెందుతారు అంటూ భయభ్రాంతులను చేశాడు. దీంతో కొందరు మహిళలు రూ.వెయ్యి నుండి రూ.2వేల వరకు సమర్పించుకొని ఇళ్ళలో పూజలు చేశారు. ఐతే కొందరు గృహస్తులు అనుమానంతో నిలదీయగా అసలు రంగు బయటపడింది. ఆధార్‌కార్డు పరిశీలించగా ఈ వ్యక్తి బళ్లారికి చెందిన కరణ్ అనితేలింది. దీంతో చుట్టుపక్కల గృహస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సిఐ మోహన్‌రెడ్డి నిందితుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సిఐ మాట్లాడుతూ ఇలాంటి మోసగాళ్ళ పట్ల అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఎవరైనా ఇంటికి దోషముందని శాంతి చేస్తామని వస్తే మోసపోవద్దని, రోగాలు బాగు చేస్తామని, సంపద సృష్టిస్తామని నమ్మిస్తారని ఇలాంటి వారిని ఇళ్ళలోకి రానివ్వవద్దని వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## చల్లంగా చూడమ్మా...గంగమ్మ!

### మరుపొంగళ్ళతో హోరెత్తిన ఆలయం



తిరుపతి, జూన్ 9ప్రభాతవార్త:

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో నాల్గవ మంగళవారం మరు పొంగళ్ళు" కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో వైభవంగా జరిగింది. తిరుపతి ప్రజల ఆరాధ్య దైవమైన గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన భక్తులు పొంగళ్ళు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. గంగమ్మ జాతర ముగిసిన అనంతరం ఐదు మంగళవారాల పాటు మరు పొంగళ్ళు నిర్వహించే సంప్రదాయంలో భాగంగా ఈ నాల్గవ వారపు కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ పురాణ, జానపద, ఆధ్యాత్మిక పాత్రల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నేరేళ్లమ్మ ఆలయం నుండి ప్రారంభమైన శోభాయాత్ర గంగమ్మ ఆలయం వరకు ఘనంగా సాగింది. డప్పుల మోతలు, మంగళ వాయిద్యాలు, భక్తి నినాదాల మధ్య కళాకారులు ఊరేగింపులో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్ ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి కళాకారులు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు సంప్రదాయ వేషధారణల ద్వారా మన సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మిక విలువలు భావితరాలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, ఈఓ జయకుమార్, రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కళాకారులు, రామకృష్ణారెడ్డి, భాస్కరాచారి, మేకల గంగయ్య, సిద్దవరం వెంకటాద్రి, వాసుదేవ రెడ్డి, కన్నప్ప గారి కేశవులు, చంద్రబాబు నాయుడు, డాక్టర్ భాస్కరరావు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కొండే చెంగారెడ్డి, అరుణమ్మ, పద్మావతి, సిద్ధమ్మ, జ్యోతి, కల్పన, లక్ష్మి ఌ, భక్తులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పొన్నాలమ్మకు పొంగళ్ళు: పానగల్ గంగమ్మకు ప్రత్యేకాలంకారం

### -కన్నుల పండువగా జాతర సంబరాలు

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త



పానగల్‌లో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. మంగళవారం ఉదయం నుంచి పొన్నాలమ్మకు పొంగళ్ళును చుట్టుపక్కల ఏడు గ్రామాలకు చెందిన మహిళలు చెల్లించుకున్నారు. అమ్మవారికి విశేష అలంకారాలు జరిపారు. దాంతో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. ఆదివారం రాత్రి చాటింపుతో జాతర సంబరాలు ప్రారంభమయ్యాయి. శ్రీకాళహస్తిలో అంతర్భాగమైన పానగల్‌లో జాతరకు ఎంతో ప్రాధాన్యత ఉంది. మంగళవారం ఉదయం విశేష సంఖ్యలో పొన్నాలమ్మ ఆలయం నందు పొంగళ్ళు పెట్టారు. పానగల్ జాతర సందర్భంగా ఉదయం నుంచి ఆలయం వద్ద భక్తుల సందడి చోటు చేసుకుంది. ఆలయంలో వెలసి అమ్మవారి మూల విరాట్టుకు విశేష అభిషేకాలతో పాటు అలంకారాలు నిర్వహించారు. అమ్మవారికి రాజరాజేశ్వరి దేవి అలంకారం నిర్వహించారు. ఓ వైపు ఎండ దడపుట్టిస్తున్నా ఖాతరు చేయక పొంగళ్ళు పెట్టారు. కమిటి అధ్యక్షుడు గుణశేఖర్, సభ్యులు వైస్ చైర్మెన్‌మునిశేఖర్, కమిటి సభ్యులు లీలా మోహన్, గణేష్, కుమార్, కార్తీక్, జయశంకర్, ఢిల్లి బాబు, పాండ్య, తదితరుల పర్యవేక్షణలో జరగనున్నాయి. పూజారి జగదీష్ విశేష అలంకారాలు జరిపారు.

## కుప్పం ఆర్డీవోగా షేక్ మహమ్మద్ హుస్సేన్ బాధ్యతలు.

కుప్పం, జూన్ 9 ప్రభాతవార్త



కుప్పం రెవెన్యూ డివిజనల్ అధికారిగా షేక్ మహమ్మద్ హుస్సేన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదివరకు ప్రకాశం జిల్లాలో పనిచేసేవారు. పదోన్నతిపై కుప్పం ఆర్డీ ఓగా నియమితులయ్యారు ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన కుప్పం ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది నూతన ఆర్డీఓకు ఘన స్వాగతం పలికారు.

## ఆలయపోటులోకి వెళ్ళడానికి ఆంక్షలు లేవా!

### టిటిడి సిబ్బంది, మహిళలు సైతం పోటులోకి ..

కార్వేటినగరం, జూన్ 9 ప్రభాతవార్త:

టి.టి.డి ఆలయ పోటును భ్రష్టు పట్టిస్తున్న వైనం కార్వేటినగరం శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం చోటు చేసుకుంది. కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలోని పోటుకు ఆంక్షలు, నిబంధనలు గత కొన్ని ఏళ్ళుగా తుంగలో తొక్కి ఎవ్వరు పడితే వారు వెళ్ళి స్వయంగా ప్రసాదాలు తెచ్చుకుంటున్నారు. అసలు పోటులోకి ఎవరు వెళ్ళాలి, ఎవరు వెళ్ళకూడదు అనే సందేహాలు పలువురిని ప్రశ్నిస్తుంది. మహిళలు సైతం నిర్భయంగా పోటులోకి వెళ్ళుతున్నారు. సాధారణంగా పోటు అయ్యవారు, అర్చకులకు మాత్రమే పోటులోకి అనుమతి. అయితే కార్వేటినగరం పోటులోకి మాత్రం టి.టి.డి సిబ్బంది, కొంతమంది మోతగాళ్ళు, ఆలయ సులభ, కొంతమంది సెక్యూరిటీలు ఎప్పుడుపడితే అప్పుడు పోటులోకి వారివారి స్వంత ఇంట్లోకి వెళ్ళివచ్చినట్లు తిరగాడుతుంటారు. మంగళవారం ఆలయపోటులోకి టిటిడి పనిచేసే ఓ మహిళ మూడుప్యాకెట్లు తీసుకొస్తూ కెమరాకు చిక్కింది. ఆలయంలో తయారు చేసే ప్రసాదాన్ని భక్తులు ఇస్తారో, ఇవ్వరో తెలియదు గాని సిబ్బందికి తెలిసిన వారికి, బంధువులకు ప్యాకెట్ల రూపంలో వెళ్ళడం పరిపాటి. దిట్టం వాహనం తిరుమల నుండి కార్వేటినగరానికి నిలుకు లేకుండా తిరిగి చేస్తుంటుంది. అయితే ప్రసాదంలో మాత్రం నెయ్యి, ముంతమామిడిపప్పు, ఎండుద్రాక్ష లాంటి వస్తువులు నామమాత్రంగా వేస్తూ మిగతా స్వాహా చేస్తున్నట్లు పలువురు వాపోతున్నారు. దిట్టం తగ్గించి మిగిలిన సరుకులను స్వాహా చేస్తున్నట్లు విమర్శ. బలిపీఠాలను నిత్యం నువ్వుల నూనెతో రుద్దాల్సి వుంది. అవేమీ సక్రమంగా చేయడం లేదని పలువురు చెబుతున్నారు.

బ్రహ్మోత్సవాల సమయంలో యాత్రికులకు, భక్తులకు, సిబ్బందికి వడ్డించాల్సిన బోజనాలు సక్రమంగా అమలు చేయడం లేదని తెలుస్తుంది. నేతితో వెలిగించే దీపాలు కూడా సక్రమంగా చేయడం లేదని అంటున్నారు. కాగా టిటిడి యాజమాన్యం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంపై ప్రత్యేక దృష్టి సారించి పోటులోకి వెళ్ళినవారిపై చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి భ్రష్టుపట్టె పనులు చేయనీయకుండా నాణ్యతమైన ప్రసాదాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**EXPRESSION OF INTEREST (EOI)**

Kuppam Area Development Authority (KADA) invites Expressions of Interest (EOI) from reputed institutions, organisations, agencies, universities, environmental experts, and consultants for undertaking a Scientific Methodology for Plantation Feasibility Study under the KADA Net Zero Initiative. Interested parties with relevant experience may submit their profile and proposal to the KADA Office, Kuppam, or through email.
Email: projectdirectorkada@gmail.com.
**Last Date for Submission: 16-06-2026**
For further details, contact: Kuppam Area Development Authority (KADA)Kuppam, Chittoor District

## డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలంటూ వామపక్షాలు నిరసన...



రైల్వేకోడూరు రూరల్, జూన్ 9 ప్రభాతవార్త

రైల్వే కోడూరు పట్టణంలో మంగళవారం వామపక్షాల ఆధ్వర్యంలో టోల్గేట్ వద్ద పెట్రోల్,డీజిల్ ధరలను తగ్గించాలంటూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్షాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, రాధాకృష్ణలు మాట్లాడుతూ కేవలం మే నెలలోనే 11 రోజుల్లో ప్రధాన మోడీ కార్పొరేట్ల లాభాల కోసం నాలుగు సార్లు ధరలు పెంచారని మొదటిసారి లీటరుపై మూడు రూపాయలు 90 పైసలు, 87 పైసలు, 86 పైసలు, 23 పైసలు లా ఇలా ప్రతిసారి పెంచుకుంటూ దాదాపు 30 రూపాయలకు పెంచారని అన్నారు. దీనితో నిత్యవసర వస్తువుల ధరలో అందుబాటులో ఉండమన్నారు. బిజెపి రాకముందు 35, 45 ఉన్న పెట్రోలు డీజిల్ 110 దాకా పెరిగాయన్నారు. వంట గ్యాస్ ధరలు 300 పైగా పెంచారని ప్రధాని మోడీ విధానాల వల్ల ఇంధనం చార్జీలు పెరిగాయని ఆరోపించారు. ఇరాన్, రష్యా తక్కువ ధరకు అప్పుగాను ఇచ్చేవని, అక్రమ యుద్ధాల వల్ల అమెరికా ట్రంప్ కు ప్రధానమంత్రి మోడీ లొంగిపోయాడని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో దార్ల రాజశేఖర్, సిపిఐ ఎంఎల్, సిగి చెన్నయ్య, ఆదం, సుబ్బయ్య, లింగాల యానాదయ్య, ప్రసాద్, కర్రతోటి హరి నారాయణ, రాజశేఖర్, బొజ్జ శివయ్య, యానాది,జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఈదులగుంట చెరువు ఆక్రమణల మయం..

### పట్టించుకోని రెవెన్యూ అధికారులు... భారీగా ముడుపులు అందుతున్నాయని గుసగుసలు ...

తొట్టంబేడు జూన్ 9 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలం, తొట్టంబేడు2 పంచాయితీ పరిధిలోని సర్వే నంబర్ 42 ఈదులగుంట చెరువు కబ్జాదారుల కోరల్లో చిక్కుకుంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో యథేచ్ఛగా ఆక్రమణలుసాగుతున్నాయి.స్థానికుల సమాచారం ప్రకారం, ఇప్పటికే చెరువులోని పెద్ద భాగాన్ని ఆక్రమించి లక్షల రూపాయలకు విక్రయించారు. అయినా కబ్జాదారుల ఆగడాలు ఆగలేదు. మిగిలి ఉన్న చెరువు భాగాన్ని సైతం జేసీబీతో చదును చేసి ప్లాట్లుగా మారుస్తున్నారు. చెరువు ఒడ్డున జేసీబీతో తవ్వకాలు జరుపుతున్నారు.వర్షాకాలం సమీపిస్తున్న వేళ చెరువును పూడ్చివేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయేదమే కాకుండా, భవిష్యత్తులో వరద ముప్పు తప్పదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకొచ్చినా, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీనిపై పత్రికల్లో పలుమార్లు ప్రచురించిన రెవెన్యూ అధికారులకి చీమకుట్టినట్టు కూడా లేదని ప్రజలు వాపోతున్నారు. భారీగా ముడుపులు అందుతున్నాయని గుసగుసలు వినబడు తున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అయితే అధికారులకి విన్నవిస్తే రాజకీయ నాయకులు ఒత్తిడికి తలోగ్గి తాము ఏమి చేయలేమని చేతులెత్తేశారు. ఊరికి నీరందించే చెరువు క్రమంగా కనుమరుగైపోతోంది.అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే భవిష్యత్ తరాలకు నీళ్లు కరువవుతాయి అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షులు దీనిపై దృష్టి సారించాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## శ్రీకాళహస్తీశ్వరాలయంలో అతిథులు



శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం మంగళవారం అతిథులతో కళ కళ లాడింది. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ఇఒ వెంకటేశులు, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ పిఆర్ఓ రవి,టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, వెంకటస్వామి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు. ప్రధాన మంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సైంటిఫిక్ సలహాదారు అజయ్‌సూద్ కుటుంబసభ్యులతో హాజరయ్యారు. సాయంత్రం నిర్వహించే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని జరిపించుకున్నారు.కాగా షార్‌డైరెక్టర్ పద్మకుమార్,రాదాలు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.కాగా సిఎం టూరు కో ఆర్డినేటర్ మహష్ చౌదరి కుటుంబసభ్యులతో ఆలయానికి రాగా వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ఇఒ వెంకటేశులు, చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ వారి సహాచరులు స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.

## రోడ్డు ప్రమాదంలో రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త మృతి



పాకాల, జూన్ 9, ప్రభాతవార్త

చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారిపై పాకాల మండలం గుంతగాడంకి గ్రామ సమీపంలో మంగళవారం రోజున రోడ్డు మరమ్మత్తుల పనులు జరుగుతున్న ప్రాంతంలో మధ్యాహ్నం మూడు న్నర గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడు కమకలపాటి వినోద్ కుమార్ (వయస్సు సుమారు 45 సంవత్సరాలు), తండ్రి కె. నాగరాజ నాయుడు, నివాసం గుర్రప్పగారిపల్లి గ్రామం, ఇటేపల్లి పోస్టు, చంద్రగిరి మండలం. (వీది) సామాజిక వర్గానికి చెందినవారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించుచుండగా, ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్, యాంటీ కార్ప్షన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాకాల పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి చిన్న గోవిందు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు బెంగళూరులో తన వ్యాపార పనులు పైపుల వ్యాపారం ముగించుకొని స్వగ్రామమైన గుర్రప్పగారిపల్లికి తన హ్యుందాయ్ ఐ10 కారులో ఒంటరిగా ప్రయాణిస్తుండగా, గుంతగాడంకి సమీపంలో అధిక వేగంతో వెళ్తూ వాహనంపై నియంత్రణ కోల్పోయి, రోడ్డు ప్రక్కన కల్వర్టు బ్రిడ్జి ను గుద్ది ప్రమాదానికి గురైనట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది అని తెలిపారు. ఈ ప్రమాదంలో వినోద్ కుమార్‌కు తీవ్ర రక్తస్రావ గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పాకాల పోలీస్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు మరియు గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలుసుకునేందుకు విచారణ కొనసాగుతోందదని పాకాల సిఐ చిన్న గోవిందు తెలిపారు.

## రైల్వే కోడూరు ఆర్ఎస్ రోడ్డును డబల్ రోడ్డుగా నిర్మాణం..

రైల్వేకోడూరు రూరల్ , జూన్ 9 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డు దాదాపు 40 సంవత్సరముల తర్వాత డబల్ రోడ్డుగా మారనున్నట్లు అందుకు రాష్ట్రం నుండి ప్రతిపాదనలు కూడా ఒకే చేసి రానున్న రోజుల్లో ఆర్ఎస్ రోడ్డును డబల్ రోడ్డు గాను మరియు బట్టర్ ఫ్లై లైటింగ్ ను ఏర్పాటు చేస్తున్నామని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు స్థాయి శక్తుల కృషి చేస్తున్నట్లు అన్నారు. ప్రజల ఆశీస్సులతోనే రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నట్లు ఆయన తెలియజేశారు. ఇప్పటికే రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలో అభివృద్ధి అనే నినాదంతో రాష్ట్రంలో కోడూరులో నిలబెడతానని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కూడా బాధితుల ఇళ్ల వద్దకే తీసుకువెళ్లి అందజేయడం ముఖ్యంగా ప్రభుత్వ అందిస్తున్న పథకాలను ప్రతి లబ్ధిదారునికి చేరే విధంగా నిరంతరం శ్రమిస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో రైల్వే కోడూరులో చేయని అభివృద్ధి పనులు లేవంటూ ప్రతి పంచాయతీని అభివృద్ధి పథంలోకి నడిపించి తమకిచ్చిన అవకాశాన్ని ప్రజలకే అప్పచెప్పే విధంగా నిరంతరం శ్రమిస్తున్నట్లు రూపనంద రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

పుత్తూరు రూరల్, జూన్ 9 ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం పుత్తూరు మండల పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... పుత్తూరు పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన సోము(32), తడుకు పంచాయతీలోని మజ్జిగగుంటకు చెందిన సురేష్(29) ద్విచక్రవాహనంలో తిరుపతికి వెళ్లి తిరిగిపుత్తూరుకు వెళుతుండగా స్థానిక గొల్లపల్లి రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన భారీ గేట్లను ఢీకొన్నారు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

## కిషోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం ముగింపు గ్రామసభ



పులిచెర్ల, జూన్ 9, ప్రభాతవార్త

మండలం కావేటి గారి పల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం కిషోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం ముగింపు గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పులిచెర్ల ఐసిడియస్ సిడిపిఓ వాణి శ్రీదేవి మాట్లాడుతూ కిశోర బాలికలకు, బాలురకు మే నెల ఒకటో తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు 12 సెక్షన్లలో వివిధ రకాల అంశాలపై పిల్లలకి అవగాహన కల్పించడం జరిగింది అని తెలియజేశారు. ఆరోగ్యం మరియు అనీమియా, చట్టాలు, అవసరాలు, పరిశుభ్రత, జీవన నైపుణ్యాలు, ఆర్థిక నిర్వహణ, శారీరక వ్యాయామం, ప్రాముఖ్యత విద్యా కెరీర్, మార్గదర్శకత్వం, మొదలు అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలియజేశారు. అలాగే ఈరోజు కార్యక్రమంలో బాల్య వివాహాల నిషేధ చట్టం గురించి క్లుప్తంగా తెలియజేశారు. చిన్నవయసులో పిల్లలకు పెళ్లి చేస్తే ఎదుర్కొనే సమస్యలపై తెలియజేశారు. అదేవిధంగా ఈరోజు గ్రామసభలో పిల్లల యొక్క తల్లిదండ్రులు ఈ కిషోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం పై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కిషోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో మా పిల్లలకు ఎన్నో విషయాలపై అవగాహన కల్పించడం వలన పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, సుహాసిని, మహిళాపోలీసు సౌజన్య, ఏఎన్ఎం శోభారాణి, అంగన్వాడికార్యకర్తలు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న సీఐ



సత్యవేడు, జూన్ 9 ప్రభాతవార్త:

సత్యవేడు మండలం తమిళనాడు సరిహద్దు దాసుకుప్పంలో గంజాయి వాడకం యువతకు ప్రమాదకరమని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీనాయుడు పేర్కొన్నారు. గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం మంగళవారం దాసుకుప్పం గ్రామంలో ఎస్ఐ సాయినాథ్‌చౌదరి ఆధ్వర్యంలో గంజాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో యువత, స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతూ గంజాయి వాడకానికి బానిసలుగా మారి అనేక నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రధానంగా ఆ మత్తులో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. తల్లిదండ్రులు పిల్లలు నడవడికపై దృష్టి పెట్టి చేసే మార్గాలకు, సులభంగా డబ్బులు సంపాదించే ఆలోచనలు దూరంగా ఉంచాలన్నారు. గంజాయిని వాడకున్న వాటిని సరఫరా చేసేవాళ్లు ఎక్కువయ్యారని, అలాంటి వాళ్ళని వదిలిపెట్టే సమస్యే లేదని ఆయన తెలిపారు.ప్రభుత్వం గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. గంజాయి బారిన పడకుండా యువత ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

## ఎగుపల్లి అటవీ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చిట్వేలి, జూన్ 9 ప్రభాతవార్త:

చిట్వేలి మండలం,నగిరిపాడు పంచాయతీ ఎగువపల్లి గ్రామానికి సమీపంలో గల అడవిలో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మంగళవారం పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు సుమారు 3035 మధ్య వ్యక్తి వయస్సు ఉండవచ్చన్నారు.మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, పురుగులు పట్టిన స్థితిలో ఉండగా, మృతుడి ముఖం గుర్తుపట్టలేని విధంగా మారిపోయిందన్నారు. మృతదేహంపై లేత సిమెంట్ రంగు ప్యాంటు మాత్రమే ఉన్నదని తెలిపారు.ప్రాథమిక విచారణలో మృతుడు సుమారు 3 నుండి 4 రోజుల క్రితం మరణించి ఉండవచ్చని ప్రస్తుతం మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.ఈ ఘటనపై గ్రామ విఆర్ఓ ఉదయ్ ఫిర్యాదు మేరకు 194 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ శ్రీనివాసులు పరిశీలించి సిబ్బందికి తగుచూచనలు చేశారు.స్థానికంగా గత నాలుగు రోజుల వ్యవధిలో పైన తెలిపిన వివరాలతో ఎవరైనా వ్యక్తులు తప్పి ఉన్నట్లయితే స్థానిక పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని సీఐ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## అంగన్వాడీ టీచర్లుకు శిక్షణ

వరదయ్యపాలెం, జూన్ 9, ప్రభాతవార్త

వరదయ్యపాలెం మండలంలోని గోవర్ధనపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి శిక్షణ, ఏఐ ఎనబెల్డ్ డ్ , ఈసీడి స్క్రీనింగ్ ఫర్ 0-6 సంవత్సరాలలోపు పిల్లలు పై శిక్షణ కార్యక్రమం సత్యవేడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ ఆఫీసర్ దేవకుమారి అధ్యక్షతన మంగళవారం మండలంలోని అంగన్వాడీ టీచర్లుకు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అన్వేష్ ఆర్ బిఎస్ కె, ఫోర్ డి ఎస్ గురించి చెప్పారు. అనంతరం ఐసిడి ఎస్ సూపర్వైజర్లు శిల్ప, యమునలు నవచేతన యాప్ గురించి వివరించి, 1000 రోజులు ప్రాముఖ్యత, అభివృద్ధి మైలురాళ్లు,ఏహెచ్ సమగ్ర అభివృద్ధి గురించి వివరిస్తూ పిపిటి రూపంలో ఎల్ ఈ డి స్క్రీన్‌లో ఏఐ గురించి, ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్మెంట్ గురించి అంగన్వాడీ కార్యకర్తలకు క్లుప్తంగా వివరణ ఇచ్చారు. ఈ శిక్షణలో సిహెచ్ ఓ రాజు కూడా ఆర్‌బిఎస్‌కె పై అవగాహన కల్పించారు.

## అంగన్వాడీ పిలుస్తోంది

పులిచెర్ల, జూన్ 9, ప్రభాతవార్త



పులిచెర్ల మండలం కావేటి గారి పల్లి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పులిచర్ల ఐసిడియస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వాణిశ్రీదేవి పాల్గొన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు అంగన్వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమం అన్ని అంగన్వాడి కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా మూడు సంవత్సరాల నిండిన పిల్లలందరూ కూడా అంగన్వాడీలో చేర్పించాలని తెలియజేశారు. అంగన్వాడీలో ఆటపాటలతో కూడిన విద్యను నేర్పిస్తారని, పౌష్టికాహారాన్ని అందిస్తారని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాలు అన్నింటిలో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని అలాగే సిలబస్‌తో కూడిన విద్య కూడా నేర్పిస్తారని తెలియజేశారు. తల్లులందరికీ కూడా మూడు సంవత్సరాల నిండిన వెంటనే పిల్లలందరినీ అంగన్వాడి కేంద్రాలలో చేర్పించి ఆరు సంవత్సరాలు వరకు కూడా అంగన్వాడీలోనే చదివించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, సుహాసిని, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## పెరిగిన ఇంధన ధరలకు వామపక్షాల నిరసన

చిట్వేలి, జూన్ 9 ప్రభాతవార్త:



ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిపిఐ సిపిఎం మోహం పక్షాలు మంగళవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఇంధన ధరల పెంపుతో నిత్యవసర వస్తువుల ధరలు అమాంతం పెరిగాయి అన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల జీవనంపై ఇది అసమాన్య ప్రభావం చూపుతూ ఉందని వాపోయారు. వెంటనే ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించి సామాన్యులకు ఊరట కలిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు పందికాళ్ళ మనీ, జ్యోతి చిన్నయ్య, తిప్పన ప్రసాద్, జిలకర సిద్ధా, మల్లి, సాదక్ భాష శంకర తదితరులు పాల్గొన్నారు.

## నల్లబెలూన్స్‌తో వైకాపా నిరసన



**శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి వైయస్ఆర్‌సిపి కార్యాలయం వద్ద మంగళవారం పార్టీ నాయకులు,కార్యకర్తలు నల్ల బెలూన్స్ తో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన వెన్నుపోటు ప్రభుత్వ రెండేళ్ళ పాలనలో ప్రజలు పూర్తిగా నష్టపోయారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా రెండేళ్ళలో తెలుగుదేశం పార్టీ సాగించిన దాడులను గతంలో జగనన్న హయాంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు.నేడు మనం ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపు నిచ్చారు.యువతకు ఉద్యోగవకాశాలు, మహిళలకు సంక్షేమం,రైతులకు భరోసా పేద ప్రజలకు అందించే దిశగా అడుగులేయాలని పవిత్రారెడ్డి పిలుపు నిచ్చారు.2027లో జగనన్న పాదయాత్ర ప్రారంభం అవుతుందని ప్రజలందరూ స్వచ్ఛందంగా ఆయనకు మద్దతుగా నిలుస్తారని ప్రజారాజ్యం కు పట్టం కడతారని వివరించారు. మనం అందరం కలసి జగనన్న ముఖ్యమంత్రి చేసుకొని ప్రజారాజ్యం తీసుకురావాలని సూచించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మరణించిన కార్మికుల ఆత్మశాంతి చేకూరాలని మౌనం పాటించారు. ప్రమాదంలో మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి కోటి రూపాలయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్‌చేసారు.ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి చిత్తూరుజిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, జడ్‌పిటిసి సంధ్యా ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటివద్ద చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపడుతున్నాం

### ..కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదాదేవి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 9 ప్రభాతవార్త:



ప్రతి ఇంటి ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ చక్కగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలిపారు. నగరంలో చెత్త సేకరణ కొరకు నూతనంగా కొనుగోలు చేసిన రెండు ఆటోలను కమిషనర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చెత్త సేకరణ జరుతున్న సమయంలో వాహనాలు బ్రేక్ డౌన్ అయిన సమస్యంలో ఇబ్బందులు రాకుండా అన్ని వీధుల్లోకి వెళ్లేలా చేస్తున్నామని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో సమగ్రంగా చెత్త సేకరణ చేసేందుకు వీలుగా కొత్త వాహనాలు కొనుగోలు చేశామని తెలిపారు. కాలువల్లో, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి, వాహనాలకు చెత్త నగర పరిశుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ ఇంజనీర్ గోమతి, డి.ఈ.రమణ, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడి పనిచేయండి ఫలితం తప్పక వుంటుంది

### ఇంచార్జీ మంత్రి అనగాని సత్యప్రసాద్



నారాయణవనం, జూన్ 9 ప్రభాతవార్త :

సత్యవేడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం సమిష్టి కష్టపడి పని చేయండి తప్పక ఫలితం వుటుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రివర్యులు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల ఇంచార్జీ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం తిరుపతిలోని ఆర్చ్ గ్రాండ్ హోటల్‌లో జరిగిన సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, కూరపాటి శంకర్‌రెడ్డిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం ఇరువురు నేతలు కలిసి మెలసి పార్టీని ముందుకు తీసుకెళ్లడంతో మరింత బలపడతామన్నారు. గ్రూపులు పెట్టుకుంటే తప్పక టిడిపి నష్టపోవడం జరుగుతుందన్నారు. కావున త్వరలోనే కోనేటి సుమన్‌కుమార్‌కి కూడా పార్టీ సముచిత స్థానం కల్పించడానికి అదిష్టానం ఆలోచిస్తున్నట్టు మంత్రి గుర్తు చేశారు. కాబట్టి విభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడి చేయాలని ఇరువురు నేతలకు తెలియజేశారు. ఈనెల 12వతేది తిరుపతిలో జరిగే కూటమి ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కలిసి కట్టుగా కార్యకర్తలను, నాయకులను తరలించి విజయవంతం చేయాలని సూచించారు. దీంతో మంగళవారం సత్యవేడు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. పార్టీ బలోపేతం అయితే మంచిదని అభిప్రాయం వ్యక్త పరుస్తున్నారు.

**తహశీల్దారుకు సన్మానం :**

నారాయణవనం తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన భార్గవిని జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం సత్కరించారు.

## ఉపాధి సిబ్బందిపై వేలాడుతున్న విజిలెన్స్ కత్తి

### - సంతృప్తి ఇవ్వని సంజాయిషులు - ఫలించని రాయబారాలు
### - రెన్యువల్ కానీ ఉద్యోగాలు.. - సందిగ్ధంలో జీవితాలు

పులిచెర్ల, జూన్ 9, ప్రభాతవార్త

పనులు చేయమన్న వారు... పచ్చగా ఉన్నారు.... అంతా మనవాళ్లే అనుకుని.. లెక్కకు మించి పనులు చేసి.. తప్పులు చేసి. తిప్పలు పడుతూ.. మనశ్శాంతిని కోల్పోయి. మనోవేదనతో. రికవరీ చెల్లింపుకు సిద్ధమయ్యారు ఉపాధి సిబ్బంది... వివరాల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 20 24 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు రూ 65 కోట్లు పనులు చేశారు. ఈ పనులలో అవకతవకలు జరిగాయని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సెంట్రల్ విజిలెన్స్ కమిటీకి ఫిర్యాదు చేశారు. ఎంపీ ఫిర్యాదు మేరకు సెంట్రల్ విజిలెన్స్ కమిటీ సభ్యులు గత సంవత్సరం సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు రెండు పర్యాయాలు తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో ఉపాధి పనులలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ముఖ్యంగా పులిచెర్ల. రొంపిచర్ల మండలంలో 20 24 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 20 25 మార్చి 31వ తేదీ వరకు దాదాపురూ 30 కోట్ల పనులు చేశారు. ఈ పనులలో ఎక్కువగా అక్రమాలు జరిగాయని రికవరీలకు సిఫార్సు చేశారు. రెండు మండలాల్లో కలిసి దాదాపు రూ. 40 లక్షల ఉపాధి సిబ్బంది చెల్లించాలని ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ చెల్లింపుల్లో మొదట సిబ్బంది నుంచి సంజాయిషీలు తీసుకున్న సంతృప్తి లేకపోవడంతో రికవరీ తప్పనిసరి అయింది.. చివరకు రాయబారాలు నడిపిన. అక్కడ కూడా చుక్కెదురు కావడంతో చేయలేని పరిస్థితుల్లో రికవరీ చెల్లింపులకు సిద్ధమయ్యారు. పులిచెర్ల మండలంలో 15 మంది ఉపాధి సిబ్బంది రికవరీ చెల్లించాలి ఇందులో కొందరు లక్షల్లో చెల్లించాలి, ఉపాధి హామీ పథకంలో ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో సిబ్బంది ఉద్యోగాలు రెన్యువల్ చేయాలని, ఈసారి రికవరీ ఉండడంతో ఉద్యోగాలు రెన్యువల్ కాక రెండు నెలలుగా జీతాలు నిలిచిపోయాయి. రికవరీలు చెల్లిస్తేనే ఉద్యోగాలు రెన్యువల్ అవుతాయి ఉద్యోగం పైన ఆధారపడి జీవితాన్ని గడుపుతున్న సిబ్బంది ఉద్యోగ భద్రత కోసం. ఇంట్లో ఉన్న బంగారాన్ని బ్యాంకుకు పంపారు. పాపం ఉపాధి సిబ్బంది ఏదో అనుకుని ఏదో అయిపోవడంతో బయటపడలేక లో లోపల కన్నీరు కార్చుకుంటూ రికవరీ చెల్లింపుకు నగదును సర్దుబాటు చేసుకుంటూ మానసికంగా సిద్ధమయ్యారు.